epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా

తెలుగు దిన పత్రిక

సంపుటి: 02
సంచిక:34

24 క్యారెట్లు 105,457.00 | కిలో వెండి 1,20,547.00 | chourastha Digitals | 19.09.2026 శనివారం, హైదరాబాద్

## ఆర్టీసీలో ఎన్నికల నగారా




- గుర్తింపు సంఘాల ఎలక్షన్ షెడ్యూల్ విడుదల
- ఎనిమిదేళ్ల నిరీక్షణ తర్వా ఎన్నికలకు నోటిఫికేషన్
- ఈనెల 21 నుంచే ఎన్నికల ప్రక్రియ ప్రారంభం
- అక్టోబర్ 9న ఎన్నికలు, అక్టోబర్ 17న ఫలితాలు విడుదల

2లో

# దానం నాగేందర్‌కు చుక్కెదురు



## ఎమ్మెల్యే దానంపై అనర్హత వేటు

- పార్టీ ఫిరాయింపుల కేసులో అయనపై అనర్హత
- స్పీకర్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును రద్దు చేసి అనర్హతా వేటు వేయాలి
- స్పీకర్ నిర్ణయాన్ని తప్పుపట్టిన న్యాయస్థానం
- అధికారం ఉందని విర్రవీగితే ఎదురుదెబ్బలు తప్పవ్
- పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై వేటు వేయాలి
- సత్యమేవ జయతే
- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్




దానం నాగేందర్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఫిరాయింపుల కేసులో దానంపై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే కాంగ్రెస్ తరపున సికింద్రాబాద్ నుంచి లోక్‌సభకు పోటీ చేయడం చట్టవిరుద్ధమని హైకోర్టు తేల్చిచెప్పింది. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన నాటి నుంచే ఎమ్మెల్యేగా అనర్హుడని స్పష్టం చేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హైకోర్టులో చుక్కెదురైంది.

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో :** దానం నాగేందర్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఫిరాయింపుల కేసులో దానంపై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే కాంగ్రెస్ తరపున సికింద్రాబాద్ నుంచి లోక్‌సభకు పోటీ చేయడం చట్టవిరుద్ధమని హైకోర్టు తేల్చిచెప్పింది. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన నాటి నుంచే ఎమ్మెల్యేగా అనర్హుడని స్పష్టం చేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. స్పీకర్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును రద్దు చేసి అనర్హతా వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన వేర్వేరు పిటీషన్లపై హైకోర్టు ఈ మేరకు ఉత్తర్వులు వెలువరించింది. ఇద్దరి పిటీషన్లపై హైకోర్టులో ఆగష్టు 21వ తేదీన వాదనలు ముగిశాయి. సెప్టెంబర్ 16వ తేదీన ఉత్తర్వులు వెలువరించాల్సి ఉన్నప్పటికీ తీర్పు కాపీలు సిద్ధం

।మిగతా 2 లో।

## హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా

- అనర్హత వేటుపై దానం నాగేందర్ రియాక్షన్
- ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా సిద్ధం
- దానం నాగేందర్

2లో

తెలంగాణ హైకోర్టు తనపై అనర్హత వేటు వేస్తూ ఇచ్చిన తీర్పుపై దానం నాగేందర్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించే విషయంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, దానిపై ఆలోచించాల్సి ఉందన్నారు.






## 22ఏ భూముల సమస్యలకు చెక్

- హైలెవల్ కమిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- 22ఏ భూములతో పాటు పలు భూ సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం కీలక నిర్ణయం
- సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్‌కుమార్ నేతృత్వంలో హైలెవల్ కమిటీని ఏర్పాటు
- సింగరేణి ఇళ్ల స్థలాలపై రేపే జీవో విడుదల
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2లో

22ఏ నిషేధిత భూములతోపాటు ఇతర భూసంబంధిత సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం కీలక అడుగేసింది. ఈ మేరకు ముగ్గురు ఉన్నతాధికారులతో కూడిన హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ ఉన్నత స్థాయి కమిటీకి సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌ను ఛైర్మన్‌గా నియమించింది. న్యాయశాఖ కార్యదర్శి పాపిరెడ్డి, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజీవ్‌గాంధీ హనుమంతులను సభ్యులుగా ఉండనున్నారు. దీంతోపాటు 118 జీవో బాధితులకు ప్రభుత్వం ఉపశమనం కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఎల్బీనగర్‌లో 9,700 ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది.

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో



## పాక్ ఎప్పుడూ వంకర మాటలే మాట్లాడుతుంది

- ఇస్లామాబాద్ చేసిన ఆరోపణలను ఖండించిన భారత్
- పాక్ నౌక ప్రమాదకర రీతిలో దూసుకురావడం వల్లే ప్రమాదం
- 1991 ద్వైపాక్షిక ఒప్పందాన్ని పాక్ ఉల్లంఘించింది
- భారత్‌వైపు ఎలాంటి నష్టం వాటిల్లలేదు
- విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్

అరేబియా సముద్రంలో భారత యుద్ధ నౌకను పాకిస్థాన్ నౌక ఢీకొన్న ఘటనకు సంబంధించి ఇస్లామాబాద్ చేసిన ఆరోపణలను భారత్ తిరస్కరించింది. ఈ ఘటనపై పాకిస్థాన్ ఇచ్చిన సమాధానం ఏ మాత్రం సమంజసం కాదని పాక్ ఎప్పుడూ వంకర మాటలే మాట్లాడుతుందని విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా, ఇరుపక్షాల మధ్య ఉన్న సంబంధిత ఒప్పందాల్లోని నిబంధనలను పాటించాలని సూచించారు.

**తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో :** ఉత్తర అరేబియా సముద్రంలో గస్తీలో ఉన్న 'ఐఎన్ఎస్ కోల్‌కతా' వద్దకు పాకిస్థాన్ నౌక 'పీఎన్ఎస్ హున్నైన్' ప్రమాదకర రీతిలో దూసుకురావడం వల్లే ఈ ఘటన జరిగిందని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఈ ఘటనపై ఇప్పటికే పాకిస్థాన్ చార్జ్ డి అఫైర్స్‌కు భారత్ తీవ్ర నిరసన తెలిపింది. కాగా, ఈ ఘటనలో భారత నౌకకు ఎలాంటి పెద్ద నష్టం వాటిల్లలేదని, అది ప్రస్తుతం సముద్రంలోనే తన విధులను నిర్వర్తిస్తోందని జైస్వాల్ వెల్లడించారు. మంగళవారం రాత్రి, ఉత్తర అరేబియా సముద్రంలో భారత నౌక గస్తీ నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. అయితే, ఈ

।మిగతా 2 లో।




## నీట్ పరీక్షలో నిర్మాణాత్మక సంస్కరణలు

- ఈ నెలాఖరుకల్లా తొలి మధ్యంతర నివేదిక'
- సుప్రీంకోర్టుకు చెప్పిన కేంద్రం
- ఇస్రో మాజీ చైర్మన్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలోని
- గత కమిటీ సభ్యులతోనూ నిలేకని ప్యానెల్ విస్తృతంగా చర్చలు
- నీట్ పరీక్ష నిర్వహణ కోసం శాశ్వత సిబ్బంది ఉండాలి
- గతంలో నీట్ ప్రశ్నపత్రం లీకేజీ దుమారం
- పరీక్షా విధానంలో సంస్కరణలపై సిఫార్సులకు కమిటీని ఏర్పాటు
- NTA పరీక్ష వ్యవస్థను పునర్వ్యవస్థీకరించడం
- అత్యాధునిక సాంకేతిక పరిష్కారాలు సిఫార్సు

2లో




## చిట్టీల పేరుతో భారీ మోసం

- రూ.కోట్లతో ఉడాయించిన దంపతులు
- హైదరాబాద్ కూకట్‌పల్లి పరిధిలో ఘటన
- అధిక వడ్డీల పేరుతో భారీ మోసం
- చిట్టీల పేరుతో భారీగా నగదు సేకరణ
- పెద్ద మొత్తంలో చేతికందగానే రాత్రికి రాత్రే పరారు

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :** వలస వచ్చి ఉన్నతంగా స్థిరపడ్డ దంపతులు కోట్లలో ఆస్తి ఉన్నా పేద, ధనిక అని సంబంధం లేకుండా స్థానికులందరితో ఆ ఇల్లాలు కలివిడిగా ఉండేది. కుమార్తె పెళ్లికి సైతం అందరిని ఆహ్వానించి ఖరీదైన బహుమతులిచ్చి తన పెద్ద మనసు చాటుకుంది. ఒకటి కాదు రెండు కాదు

।మిగతా 2 లో।

# దానం నాగేందర్‌కు చుక్కెదురు



**తరువాయి భాగం**

కాకపోవడంతో సీజే ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు వెలువరించింది. ఈ రెండు పిటిషన్లపై హైకోర్టు సుదీర్ఘ విచారణ నిర్వహించింది. దానం నాగేందర్ బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ పార్టీ టికెట్ పై లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేశారని పాడి కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌లో ఉన్న పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం దానంపై అనర్హతా వేటు వేయాలని వాదించారు. స్పీకర్ సరైన నిర్ణయం తీసుకోకపోతే నేరుగా జోక్యం చేసుకొని ఎమ్మెల్యేపై వేటు వేసే అధికారం హైకోర్టుకు ఉందని వాదనలు వినిపించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై వేటు వేయాలని గతంలో సుప్రీంకోర్టు కూడా పేర్కొందని వాదించారు. దానం నాగేందర్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేయకపోయినా ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేయడంతోనే సహజంగా సభ్యత్వం పోయినట్లేనని ఏలేటి మహేశ్వర్ రెడ్డి తరపు న్యాయవాది వాదించారు. దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసి పార్టీ మారినప్పటి నుంచి ఆయనకు శాసనసభ నుంచి అందిన జీతభత్యాలను తిరిగి చెల్లించేలా ఆదేశించాలని వాదించారు.దానంపై స్పీకర్ ట్రైబ్యునల్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ సరైన ఆధారాలు లేవంటూ స్పీకర్ ట్రైబ్యునల్ ఎలాంటి చర్యలు చేపట్టకుండా మార్చి 11వ తేదీన జారీ చేసిన ఉత్తర్వులు రద్దు చేయాలని కోరారు. దానం ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే ఉన్నారని శాసనసభలోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే కొనసాగుతున్నారని ఆయన తరపు న్యాయవాది వాదించారు. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎం రేవంత్‌రెడ్డిని దానం కలిశారని వాదించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ఫోటోలను చూసి.. అపోహతోనే పిటీషన్లు దాఖలు చేశారని దానం తరపు న్యాయవాది వాదించారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వు చేసి ఉత్తర్వులు వెలువరించింది. దానంపై అనర్హతా వేటు వేస్తూ ఉత్తర్వులు వెలువరించింది.

దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. సత్యమేవ జయతే అంటూ ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్వీట్ చేశారు. పార్టీ ఫిరాయించిన మిగితా వారికీ ఇదే పరిస్థితి పడుతుందన్నారు. ఇదే అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పందించారు. బీఆర్ఎస్ పార్టీకి విజయం లభించిందన్నారు. అమ్ముడుపోతే అనర్హత తప్పదని తాము గతంలోనే చెప్పామన్న కౌశిక్ రెడ్డి, హైకోర్టు తీర్పు కాంగ్రెస్ పార్టీకి చెంపదెబ్బ అని పేర్కొన్నారు. మిగిలిన 8 మందిపైనా అనర్హత వేటు పడేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఉపఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేస్తుందని కౌశిక్‌రెడ్డి తెలిపారు. అధికారం ఉందని విర్రవీగితే ఎదురు దెబ్బలు తప్పవని అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో.. చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు

## నీట్ పరీక్షలో నిర్మాణాత్మక సంస్కరణలు

**తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో :**

నీట్ పరీక్షలో నిర్మాణాత్మక సంస్కరణలపై సలహాలు ఇచ్చేందుకు నందన్ నిలేకని నేతృత్వంలో ఏర్పాటైన అత్యున్నత స్థాయి కమిటీ ఈ నెలాఖరుకల్లా తొలి మధ్యంతర నివేదికను సమర్పించే అవకాశం ఉంది. ఈ మేరకు కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. జస్టిస్ PS నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనానికి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ విషయాన్ని వెల్లడించారు. ఇస్రో మాజీ చైర్మన్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలోని గత కమిటీ సభ్యులతోనూ నిలేకని ప్యానెల్ విస్తృతంగా చర్చలు జరిపిందని తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై అఫిడవిట్ దాఖలు చేయాలని DOPT జాయింట్ సెక్రటరీని ఆదేశించింది. ఈ మేరకు రెండు వారాల్లోగా పురోగతిని తెలియజేస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది.

నీట్ పరీక్ష నిర్వహణ కోసం శాశ్వత సిబ్బందితో కూడిన పటిష్టమైన, శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయడమే అత్యంత కీలకమని కోర్టు స్పష్టం చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ NTA కొత్తగా అప్‌గ్రేడ్ చేసిన కేంద్రాన్ని తాము స్వయంగా సందర్శించి వ్యవస్థను పరిశీలిస్తామని న్యాయమూర్తులు పేర్కొన్నారు. "వ్యవస్థ సరిగ్గా పనిచేస్తుందో లేదో, సిబ్బంది ఎలా ఉన్నారో చూడటానికి మేమే ఒక రోజు అక్కడికి వస్తాము. మొత్తం వ్యవస్థకు శాశ్వతత్వం ఉండటమే కీలకం అని మీరు తెలుసుకోవాలి. ఒక శాశ్వత స్థలం, శాశ్వత ఏర్పాట్లు ఉండాలి. కనీసం సగం మంది సిబ్బంది అయినా అక్కడ ఉండాలి. అందరూ డిప్యూటేషన్‌పై వచ్చినవారు కాకూడదు. శాశ్వత సిబ్బంది ఉండాలి. అప్పుడే ఒక శాశ్వత నిర్మాణం ఏర్పడుతుంది. జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్‌టీఏ) కొత్తగా ఆధునీకరించిన కేంద్రాన్ని సందర్శించి, అక్కడి వ్యవస్థను పరిశీలించాలని తాము భావిస్తున్నాం." అని ధర్మాసనం చెప్పింది.ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఫైమా) తరపున న్యాయవాది తన్వి దుబే దాఖలు చేసిన పిటిషన్‌తో సహా పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ క్రమంలోనే ఆగస్టు 19న విచారించిన సుప్రీం, ఎన్‌టీఏలో సంస్కరణలను సంస్థాగతం చేయాల్సిన అవసరం ఉందని గమనించింది. ఇందుకోసం రాధాకృష్ణన్ ప్యానెల్, నీలేకని కమిటీ సిఫార్సులను అమలు చేయడానికి తీసుకున్న చర్యల గురించి తమకు తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించింది.

అంతకుముందు నీట్ ప్రశ్నపత్రం లీకేజీ దుమారం రేపిన వేళ కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యల్లో భాగంగా పరీక్షా విధానంలో సంస్కరణలపై సిఫార్సులకు కమిటీని ఏర్పాటు చేసింది. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ఇందులో నందన్ నీలేకనితో పాటు మరో ఐదుగురు ఈ టాస్క్ ఫోర్సులో సభ్యులుగా నియమించారు. ఇస్రో మాజీ ఛైర్మన్ యస్. సోమనాథ్, ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డైరెక్టర్ తపన్ డేకా, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ వి. కామకోటి, కేంద్ర విద్యాశాఖ మాజీ కార్యదర్శి అనితా కర్వాల్, లాజిస్టిక్స్, పరిపాలనా నిపుణుడు అమృత్ లాల్ మీనా ఉన్నారు.

**ప్రధాన బాధ్యతలు**

NTA పరీక్ష వ్యవస్థను పునర్వ్యవస్థీకరించడం
పరీక్షల్లో సాంకేతిక భద్రతను బలోపేతం చేయడం
పేపర్ లీకులు, మాల్‌ప్రాక్టీస్‌ను అరికట్టేందుకు కొత్త వ్యవస్థలు రూపొందించడం
పరీక్షల నిర్వహణలో నిర్మాణాత్మక సంస్కరణలు సూచించడం
డిజిటల్ భద్రత, అభ్యర్థుల ధ్రువీకరణ, డేటా రక్షణకు అత్యాధునిక సాంకేతిక పరిష్కారాలు సిఫార్సు చేయడం
భవిష్యత్తులో జాతీయ స్థాయి పరీక్షలు పారదర్శకంగా, విశ్వసనీయంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించడం

## ఉపఎన్నికల్లో 'దీదీ'కి షాక్

**తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో :**

బంగాల్ రాజకీయాల్లో ఊహించని పరిణామం జరిగింది. ఉపఎన్నికలు జరగనున్న వేళ మమతా బెనర్జీకి ఎదురుదెబ్బ తగిలింది. నందిగ్రామ్ అసెంబ్లీ ఉపఎన్నిక బరిలో నుంచి బంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వర్గం అభ్యర్థి సంచిత ప్రధాన్ దేవ్ అనూహ్యంగా తప్పుకున్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడానికి ఒక్క రోజు ముందు ఆమె తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. తమ అభ్యర్థి నామినేషన్ ఉపసంహరించుకున్న నేపథ్యంలో, నందిగ్రామ్ ఉపఎన్నికలో కాంగ్రెస్‌కు తాము పూర్తి మద్దతు ఇస్తామని మమత ప్రకటించారు. తన వర్గం అభ్యర్థి పోటీ నుంచి తప్పుకున్న కొద్ది గంటలకే ఆమె ఈ ప్రకటన చేశారు. ఈ పరిస్థితుల్లో రాహుల్ గాంధీ, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తనకు సంఘీభావం ప్రకటించారని వెల్లడించారు. తామంతా కలిసికట్టుగా బీజేపీపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అక్టోబర్ 6న జరగనున్న ఉప ఎన్నికల కోసం మమతా నేతృత్వంలోని వర్గానికి 'మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' అనే పేరును 'ఫుట్‌బాల్ ప్లేయర్' గుర్తును ఎన్నికల సంఘం శుక్రవారం కేటాయించింది. అదే సమయంలో ప్రత్యర్థి అరూప్ రాయ్ నేతృత్వంలోని వర్గానికి 'డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్' పేరు 'ఎన్వలప్' (కవరు) గుర్తును కేటాయించింది. టీఎంసీ పేరు, ఎన్నికల గుర్తు విషయంలో ప్రత్యర్థి వర్గాల మధ్య తీవ్ర వివాదం నడుస్తున్న తరుణంలో ఎన్నికల సంఘం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. అయితే, తృణమూల్ కాంగ్రెస్‌కు సాంప్రదాయంగా ఉన్న ఎన్నికల గుర్తును తొలగించడాన్ని మమతా బెనర్జీ వర్గం తీవ్రంగా ఖండించింది. ఈసీ నిర్ణయం వెలువడిన కొన్ని గంటల్లోనే సంచిత ప్రధాన్ దేవ్ తన నామినేషన్ ఉపసంహరించుకోవడం బంగాల్ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**అసలేం జరిగింది?**

నందిగ్రామ్ నుంచి మమతా వర్గం తరపున బరిలోకి దిగిన సంచిత ప్రధాన్ దేవ్ తన భర్త సత్యజిత్‌తో కలిసి బంగాల్ సచివాలయం 'నబన్న'కు వెళ్లారు. అక్కడ సీఎం సువేందు అధికారితో భేటీ అయ్యారు. సమావేశం ముగిసిన వెంటనే ఆమె తన నామినేషన్ పత్రాలను ఉపసంహరించుకున్నారు. దీంతో ఉపఎన్నికలో నందిగ్రామ్ నియోజకవర్గంలో 'మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' వర్గానికి అభ్యర్థి లేకుండా పోయారు.

మరోవైపు, ఈ పరిణామాలపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలను విచ్ఛిన్నం చేయడం, బలహీనపరచడమే బీజేపీ లక్ష్యంగా పెట్టుకుందని మమత ఆరోపించారు. అలాగే, 28 ఏళ్లుగా ఉన్న తమ పార్టీ అధికారిక గుర్తును ఈసీ ఏ విధంగా స్తంభింపజేస్తుందని ప్రశ్నించారు. ఆ పరిణామాన్ని "ప్రజాస్వామ్యానికి చీకటి రోజు"గా మమతా అభివర్ణించారు. 'గత 28 ఏళ్లుగా, అంటే ఆరంభం నుంచి తమ వద్ద ఉన్న గుర్తును వారు (ఈసీ) ఎలా స్తంభింపజేయగలరు?' అని వ్యాఖ్యానించారు. అదే సమయంలో టీఎంసీలోని తిరుగుబాటు నేతలు బీజేపీకి పనిచేస్తున్నారని విమర్శలు గుప్పించారు. కేవలం బంగాల్‌లోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా ఎన్నికలను అపహాస్యం చేసిందని ఆరోపించారు. నిన్నటి దాకా తమ పార్టీ గుర్తుపై ఎన్నికై గెలిచిన వారే నేడు అదే గుర్తును సవాల్ చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.మహారాష్ట్రలోని రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ, "ముందు ఉద్ధవ్ ఠాక్రే పార్టీని, ఆ తర్వాత ఎన్‌సీపీని విచ్ఛిన్నం చేశారు. ఇప్పుడు మాపై పడ్డారు. టీఎంసీ పేరు, దాని గుర్తును నిలవనివ్వనని సువేంధు అధికారి గతంలోనే చెప్పారు. కానీ, వాళ్లు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ వారికి మేం తలవంచం" అని మమతా ఆరోపించారు. కాబట్టి, నందిగ్రామ్‌లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని, 'ఇండి కూటమిని బలోపేతం చేయడానికి' తమ పార్టీ నిర్ణయించిందని మమత స్పష్టం చేశారు.

## ఆర్టీసీలో ఎన్నికల నగారా

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో (టీజీఎస్ ఆర్టీసీ) మరోసారి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు రంగం సిద్ధమైంది. కార్మికులు ఎనిమిదేళ్లుగా ఈ ఎన్నికల కోసం ఎదురుచూస్తుండగా ఎట్టకేలకు షెడ్యూల్ ఖరారైంది. ఈ మేరకు కార్మిక శాఖ జాయింట్ డైరెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఈ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 21 నుంచే ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. అక్టోబర్ 9న ఎన్నికలు జరుగుతాయని, అక్టోబర్ 26న తుది ఓటరు జాబితాను అన్ని జిల్లాల్లో విడుదల చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. చివరగా అక్టోబర్ 17న ఫలితాలు వెల్లడిస్తామని అధికారులు ప్రకటించారు. కాగా ఆర్టీసీలో చివరిసారిగా 2016 జులై 19న గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి.

ఆర్టీసీలో అనేక కార్మిక యూనియన్లు ఉన్నప్పటికీ ఎన్నికల్లో గెలిచిన వాటిని మాత్రమే గుర్తింపు సంఘంగా పరిగణిస్తారు. ఈ గుర్తింపు పొందిన యూనియన్లు రీజియన్, రాష్ట్ర స్థాయిల్లో పనిచేస్తాయి. ఈ రెండింటి ఎన్నికలకు కూడా వేర్వేరు బ్యాలెట్ పత్రాలను ఉపయోగిస్తారు. కార్మికుల వేతనాలు, బోనస్‌లు, కరవు భత్యం (డీఏ), సర్వీస్ నిబంధనలు, తదితర అంశాలపై సంస్థ యాజమాన్యం సర్కారుతో చర్చలు జరిపే చట్టపరమైన హక్కు ఈ గుర్తింపు సంఘాలకే ఉంటుంది. కార్మికుల తరపున ఒప్పందాలు కుదుర్చుకోవడంలో కూడా గుర్తింపు సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయి. రీజియన్‌లో పనిచేసే అధికారి స్థాయి మినహాయించి మిగిలిన ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులందరూ ఓటు వేయడానికి అర్హులు.

**ప్రచారం ప్రారంభించిన సంఘాలు**

వాస్తవానికి ఈ ఎన్నికలు 2018లోనే జరగాల్సి ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వం వీటిని నిర్వహించలేదు. అయితే ఈసారి దాదాపు 48 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. గుర్తింపు సంఘం ఎన్నికలను పురస్కరించుకుని ఇప్పటికే పలు కార్మిక సంఘాలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. కార్మికుల సమస్యలు, వేతన సవరణ, ఉద్యోగ భద్రత వంటి అంశాలే ప్రధాన ఎజెండాగా మారాయి. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు కార్మిక శాఖ అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తోంది.

**ఆర్టీసీ సంఘాల ఎన్నికల పూర్తి షెడ్యూల్ ఇదే**

సెప్టెంబర్ 18: ఎన్నికల షెడ్యూల్ విడుదల
సెప్టెంబర్ 21: ఎన్నికల్లో పోటీ చేయడానికి సంఘాల సమ్మతి
సెప్టెంబర్ 22: యూనియన్లకు ఓటర్ లిస్ట్ అందించడంతో పాటు అభ్యంతరాల స్వీకరణ ప్రారంభం
సెప్టెంబర్ 24: ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు దాఖలు చేసే అవకాశం
సెప్టెంబర్ 25: సంఘాలకు తుది ఓటర్ల జాబితా అందజేత
సెప్టెంబర్ 26: యూనియన్లకు ఎన్నికల గుర్తుల కేటాయింపు, రిటర్నింగ్ అధికారికి తుది ఓటర్ల జాబితా అప్పగింత
సెప్టెంబర్ 29: యూనియన్లకు నమూనా బ్యాలెట్ పత్రాల సమర్పణ
అక్టోబర్ 09: ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
అక్టోబర్ 14, 15: పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్
అక్టోబర్ 17: ఫలితాల వెల్లడి

హైదరాబాద్‌లో ట్రాఫిక్, కాలుష్యానికి చెక్! నగరానికి నలుదిక్కులా నాలుగు బ

## పాక్ ఎప్పుడూ వంకర మాటలే మాట్లాడుతుంది

**తరువాయి భాగం**

ప్రమాదంలో భారత్‌వైపు ఎలాంటి నష్టం వాటిల్లలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. పాక్ నౌక హునైన్ క్లాస్‌కు చెందినదని, భారత్‌ది యుద్ధనౌక అని పేర్కొన్నాయి. ప్రమాద సమయంలో సముద్రం అల్లకల్లోలంగా ఉందని, ఘటన తర్వాత రెండు నౌకలు దూరంగా వెళ్లాయని వర్గాలు తెలిపాయి.

**ఎర్ర సముద్రంపై భారత్ ఆందోళన**

మరోవైపు ఎర్ర సముద్ర ప్రాంతంలో భద్రతా పరిస్థితి తీవ్రతరం కావడంపై భారత్ మరోసారి ఆందోళన వ్యక్తం చేసింది. పౌరులు, ఆర్థిక ఆస్తులతో పాటు సౌదీ అరేబియా భూభాగాన్ని లక్ష్యంగా చేసుకుని హౌతీలు జరిపిన దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఇలాంటి దాడులు ప్రాంతీయ భద్రతకు విఘాతం కలిగిస్తాయని రణ్‌ధీర్ జైస్వాల్ అన్నారు. హౌతీల దాడులు ప్రాంతీయ శాంతి, భద్రతపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా బాబ్ అల్ మండబ్ జలసంధి గుండా నౌకాయాన స్వేచ్ఛకు ఇలాంటి పరిస్థితులు ముప్పుగా మారతాయని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో త్వరగా శాంతి, స్థిరత్వం పునరుద్ధరిస్తారని భారత్ ఆశిస్తున్నట్లు చెప్పారు.


**బంగ్లాదేశ్ ఒప్పందాలపై**

గత అవామీ లీగ్ ప్రభుత్వం హయాంలో కుదిరిన 101 ద్వైపాక్షిక ఒప్పందాలను ఢాకాలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) నేతృత్వంలోని ప్రభుత్వం సమీక్షిస్తోందన్న వార్తలపైనా విదేశాంగ శాఖ స్పందించింది. ఈ అంశానికి సంబంధించి కొన్ని మీడియా కథనాలను తాము చూశామని జైస్వాల్ తెలిపారు. అయితే బంగ్లాదేశ్ ప్రభుత్వం నుంచి భారత్‌కు అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని చెప్పారు. భారత్ తన జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ద్వైపాక్షిక ఒప్పందాలపై బంగ్లాదేశ్ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను భారత్ పరిశీలిస్తుందని తెలిపారు. అధికారికంగా సమాచారం అందిన తర్వాతే దీనిపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## ఆపదలో అభయహస్తం

**కొత్తగూడెం, తెలంగాణ చౌరస్తా:**

మహిళలు,బాలికల భద్రత, వేధింపుల నివారణపై అవగాహన కల్పించేందుకు ఎస్.ఆర్ ప్రైమ్ స్కూల్‌లో షీ టీమ్-భరోసా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఎస్.ఐ రమాదేవి పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. రాగింగ్,టీజింగ్, బ్లాక్‌మెయిలింగ్,అసభ్యకర మెసేజ్‌లు,తప్పుడు ఫోన్ కాల్స్, బహిరంగ ప్రదేశాల్లో వేధింపులు వంటి ఘటనలు ఎదురైనప్పుడు భయపడకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూచించారు.షీ టీమ్స్ మహిళలు ,బాలికలకు అండగా ఉంటాయని,బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లేందుకు ఇబ్బంది పడేవారి వద్దకే షీ టీమ్స్ చేరుకుని సమస్య పరిష్కారానికి



చర్యలు తీసుకుంటాయని చెప్పారు.ఫోన్,వాట్సాప్ తదితర మార్గాల ద్వారా ఫిర్యాదు చేయవచ్చని వివరించారు.ఈ సందర్భంగా పోక్సో చట్టం,బాల్య వివాహాల నిరోధక చట్టం తదితర చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందాలని ఎస్ఐ రమాదేవి సూచించారు. కార్యక్రమంలో భరోసా కోఆర్డినేటర్ సుమలత, ఏఎస్ఐ కస్తూరి,పిసి రాంబాబు,పాఠశాల ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

# 22ఏ భూముల సమస్యలకు చెక్

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

22ఏ నిషేధిత భూములతోపాటు ఇతర భూసంబంధిత సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం కీలక అడుగేసింది. ఈ మేరకు ముగ్గురు ఉన్నతాధికారులతో కూడిన హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ ఉన్నత స్థాయి కమిటీకి సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌ను ఛైర్మన్‌గా నియమించింది. న్యాయశాఖ కార్యదర్శి పాపిరెడ్డి, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజీవ్‌గాంధీ హనుమంతులను సభ్యులుగా ఉండనున్నారు. దీంతోపాటు 118 జీవో బాధితులకు ప్రభుత్వం ఉపశమనం కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఎల్బీనగర్‌లో 9,700 ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది.భూ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన 12 అంశాల కార్యాచరణ ప్రణాళికకు అనుగుణంగా ముందుకెళ్తోంది. దీంతో ఇతర భూ సంబంధిత సమస్యలనూ వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీని ప్రకారం ఎల్బీనగర్‌లో జీవో నంబర్ 118 కింద అందిన దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయం వల్ల ఆయా కాలనీల్లో నివసిస్తున్న 9,700కు పైగా కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని ప్రభుత్వం పేర్కొంది. ఈ క్రమబద్ధీకరణ ప్రక్రియ శనివారం నుంచే ప్రారంభమవుతుందని తెలిపింది. ఈ రెగ్యులరైజేషన్ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.సింగరేణి కాలనీ పరిధి ప్రాంతానికి సంబంధించిన భూ సమస్యలను కూడా పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ మేరకు అక్కడ జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఈ మేరకు తగిన కార్యాచరణను రూపొందిస్తామన్నారు. ఇందుకు సంబంధించి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబుతో సైత్త చర్చలు జరిపి, రేపే జీవోను విడుదల చేస్తామని ప్రకటించారు.అదే సమయంలో సెక్షన్ 22ఏ కారణంగా హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ లేదా డీటీసీపీ వంటి సంబంధిత అధికారుల ద్వారా ఆమోదం పొందినప్పటికీ రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన లేఅవుట్లను క్రమబద్ధీకరించే ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లుగా ఈ లేఅవుట్లు రెగ్యులరైజేషన్ ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొంగులేటి శాసనసభ వేదికగా వెల్లడించారు.

## హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ హైకోర్టు తనపై అనర్హత వేటు వేస్తూ ఇచ్చిన తీర్పుపై దానం నాగేందర్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించే విషయంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, దానిపై ఆలోచించాల్సి ఉందన్నారు.

**ఉపఎన్నికకు రెడీ**

రాజకీయాల్లో పోరాటాలు తనకు కొత్త కాదని, తాను యుద్ధం చేసే ఈ స్థాయికి వచ్చానని దానం నాగేందర్ వ్యాఖ్యానించారు. రాబోయే ఉపఎన్నికలను పూర్తిగా స్వాగతిస్తున్నామని, ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో పోటీ చేయడం, కొట్లాడటం తనకు అలవాటేనని, మళ్లీ పోరాడి కచ్చితంగా గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ రాజకీయ యుద్ధంలో చివరికి తామే విజయం సాధిస్తామని, ఉప ఎన్నికల్లో పోటీకి సంపూర్ణంగా సిద్ధమవుతున్నానని ఆయన పేర్కొన్నారు. ఈ ఉపఎన్నిక యుద్ధంలో విజయం తమదేనని స్పష్టం చేశారు.

## చిట్టీల పేరుతో భారీ మోసం

**తరువాయి భాగం**

అందరితోనూ పదేళ్లకు పైగానే అనుబంధం ఉంది. ఏ చిన్న ఫంక్షన్ చేసినా స్థానికులందరితో కలిసి జరుపుకునేది. అలా ఎంతో నమ్మకంగా రెండు దశాబ్దాలుగా తమలో కలిసిపోయి జీవిస్తున్న ఆ దంపతులను అంతా గుడ్డిగా నమ్మారు. ప్రతిఫలంగా పోలీస్‌స్టేషన్ మెట్లెక్కారు. న్యాయం సత్వరమే జరగాలి అంటూ వారి ఇంటి ముందు ధర్నా చేపట్టారు. వారి నిరసనతో అక్కడి పరిస్థితి కాస్త ఉద్రిక్తంగా మారింది. అందరితో కలగొలుపుగా ఉన్న ఆ దంపతులు చేసిన తప్పేంటి? వారిని నమ్మి ఎందుకు స్థానికులు పోలీస్‌స్టేషన్ మెట్లాక్కాల్సి వచ్చింది? అసలేం జరిగింది?ఇప్పుడు చూద్దాం. భవిష్యత్తు అవసరాల కోసం దాచుకున్న సొమ్మును అప్పగిస్తే ఏకంగా 28 ఏళ్ల పరిచయాన్ని, నమ్మకాన్ని ఆసరాగా చేసుకున్న దంపతులు కోట్ల రూపాయలకు కుచ్చుటోపీ పెట్టారు. కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో అధిక వడ్డీలు, చిట్టీల పేరుతో ఆశ చూపి ఘరానా మోసానికి పాల్పడిన దంపతులు రాత్రికి రాత్రే ఉడాయించిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. బాధితులంతా మూకుమ్మడిగా ఆ మోసగాళ్ల ఇంటి ముందు ధర్నాకి దిగారు. 2దశాబ్దాలకు పైగా స్నేహం నటించి, చిట్టీల పేరుతో కొన్ని రోజులు అంతా సజావుగా సాగించిన దంపతులు పెద్ద మొత్తం చేతికందగానే తమ అసలు రూపాన్ని బయటకు తీశారు.ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం కొనిజేడు గ్రామానికి చెందిన రమణా రెడ్డి, సీతమ్మ దంపతులు దాదాపు 28 ఏళ్ల క్రితం హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ ప్రాంతానికి వచ్చి స్థిరపడ్డారు. కాలనీవాసులతో ఎంతో సన్నిహితంగా మెలుగుతూ కొంతకాలంగా ఇందిరానగర్, సాయిచరణ్ నగర్ నివాసితులతో పెద్ద ఎత్తున చిట్టీల వ్యాపారం నిర్వహించారు. ఇన్నేళ్లుగా నమ్మకంగా వ్యవహరించడంతో స్థానికులు తమ కష్టార్జితాన్ని, పిల్లల పెళ్లిళ్లు, భవిష్యత్తు అవసరాల కోసం దాచుకున్న సొమ్మును వీరి వద్దే చిట్టీలు వేస్తూ వచ్చారు. బాధితులు తమ అత్యవసరాల నిమిత్తం డబ్బులు ఇవ్వాల్సిందిగా కోరగా సదరు దంపతులు రకరకాల కారణాలు చెబుతూ కాలయాపన చేశారు. కుమార్తె పెళ్లి కోసం కూడబెట్టుకున్న సొమ్ము ఇచ్చి ఒకరు, దంపతులను నమ్మి అప్పుగా ఇచ్చినవారు మరొకరు, భవిష్యత్ అవసరాల కోసం ఉపయోగపడతాయని ఇంకొకరు, అధిక వడ్డీ వస్తుందని ఆశతో ఇలా ఒక్కొక్కరు తమ కష్టార్జితాన్ని లక్షల్లో దంపతులకు ఇచ్చారు. ఇప్పుడు దారుణంగా మోసపోయి బోరుమంటున్నారు. ఆ దంపతులు కాజేసిన సొమ్ము దాదాపు 20 నుంచి 50 కోట్ల రూపాయలు ఉంటుందని బాధితులు చెబుతున్నారు. డబ్బులు అడిగితే కాలయాపన చేస్తున్న దంపతులను అనుమానంతో కొందరు నిలదీశారు. అప్పటికే పెద్దమొత్తంలో సొమ్ము చేతికందడంతో ఆగస్టు 25న నిందితులు ఇల్లు విడిచిపోయారు. బాధితులకు ఐపీ నోటీసులు పంపించడంతో వారంతా ఇంటికి వెళ్లి చూడగా తాళాలు వేసి ఉన్నాయి. తాము మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు పరారీలో దంపతుల కోసం గాలిస్తున్నారు.అప్పటి దాకా చిన్నమొత్తంతో వ్యవహారం బాగా నడిపించిన ఆ దంపతులు భారీ మొత్తంలో సొమ్ము ముట్టగానే తన దుర్బుద్ధిని చూపించారు. ఆడపిల్ల పెళ్లి విషయంలో తనని ఆపదలో ఆదుకున్న వారిని నట్టేట ముంచింది. ఎంత పరిచయస్తులైనా అనధికారిక వ్యక్తుల వద్ద, గుర్తింపు లేని సంస్థల్లో చిట్టీలు వేయకూడదని పోలీసులు సూచిస్తున్నారు.



## తూనికలు కొలతల అధికారుల తనిఖీలు

**కాల్వ శ్రీరాంపూర్,తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో శుక్రవారం జరిగే వారసంతలో తూనికలు కొలతల అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చిరు వ్యాపారులకు చెందిన కాంటాలను తనిఖీ చేశారు.కొలతలు సక్రమంగా లేని కాంటాలను సరిచేసి నంబర్లు వేశారు. కొలతలు సరిగా లేని వారికి జరిమానా విధించారు.ఈ తనిఖీల్లో లీగల్ మెట్రాలజీ జిల్లా అధికారి ఠాగూర్ రఘువీర్ సింగ్, సిబ్బంది, పాల్గొన్నారు.



# కూకట్ పల్లిలో ఘనంగా అన్న సమారాధన

- బజరంగ్ వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు

**కూకట్ పల్లి,తెలంగాణ చౌరస్తా:**

కూకట్ పల్లి హనుమాన్ దేవాలయం వద్ద బజరంగ్ వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శుక్రవారం అన్న సమారాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కురుమయ్యగారి కొండలరావు సౌజన్యంతో కురుమయ్యగారి నవీన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్న సమారాధన కార్యక్రమానికి భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా బజరంగ్ వినాయక భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి యువత నుంచి విశేష స్పందన లభించింది. పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకున్నారు. అన్న సమారాధన, రక్తదాన శిబిరం కార్యక్రమాల్లో స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. భక్తి కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించిన బజరంగ్ వినాయక భక్త బృందం సభ్యులను పలువురు అభినందించారు.

# దానం నాగేందర్‌పై అనర్హత వేటు

- బీఆర్ఎస్ న్యాయ పోరాటానికి దక్కిన విజయం
- బిఆర్ఎస్ యువ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి



**అబ్దుల్లాపూర్ మెట్,తెలంగాణ చౌరస్తా:**

పార్టీ ఫిరాయించిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేస్తూ సంచలన తీర్పునివ్వడంపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ తీర్పును రాజ్యాంగ స్ఫూర్తికి, ప్రజాస్వామ్య విలువలకు దక్కిన విజయంగా ఆయన అభివర్ణించారు. బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన న్యాయ పోరాటం వల్లే ఈ ఫలితం సాధ్యమైందని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోత్సహిస్తున్న ఫిరాయింపు చిల్లర రాజకీయాలకు ఈ తీర్పు ఒక చెంపపెట్టని వ్యాఖ్యానించారు. హైకోర్టు నిర్ణయం పట్ల తెలంగాణ ప్రజలతో పాటు బీఆర్ఎస్ శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని, బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# రామోజీ ఫిలింసిటీ ఉద్యోగి అదృశ్యం

- పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు



**ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా:**

రామోజీ ఫిలింసిటీలోని మెకానికల్ విభాగంలో పనిచేస్తున్న ఒక వృద్ధుడు అదృశ్యమైన సంఘటనపై అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం ఒడిశా, భద్రక్ జిల్లా, వాసుదేవ్‌పూర్‌కు చెందిన గౌరంగ్ సాహూ (60) గత ఆరు నెలలుగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, అనాజ్‌పూర్ పరిధిలోని ఈనాంగూడలో అద్దెకు ఉంటున్నారు.ఆయన కుమారుడు పరేష్ కుమార్ సాహూ,తల్లి, సోదరితో కలసి హయత్‌నగర్ మండలంలోని భాగ్యలత, సుభద్రానగర్‌లో నివాసముంటున్నారు.ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో పరేష్ కుమార్ తన తండ్రి గౌరంగ్ సాహూకు ఫోన్ చేయగా, తాను భువనేశ్వర్ నుండి భద్రక్ వెళ్తున్నానని..వారంలోగా తిరిగి వస్తానని చెప్పారు.అయితే అదే రోజు సాయంత్రం నుండి ఆయన ఫోన్ స్విచ్ ఆఫ్ అయింది.వారం రోజులు గడిచినా గౌరంగ్ సాహూ తిరిగి రాకపోవడంపట్ల బంధువులు, స్నేహితులు తెలిసిన ప్రదేశాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుమారుడు పరేష్ కుమార్ పోలీసులను ఆశ్రయించారు.బాధితుడి ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు అబ్దుల్లాపూర్ మెట్ సిఐ అశోక్ రెడ్డి తెలిపారు.



# వినాయక మండపంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

- అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి

**నూతనకల్, తెలంగాణ చౌరస్తా:**

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నూతనకల్ మండల కేంద్రంలోని నాగం అనిల్ రెడ్డి నివాసం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం టిక్యా తండాలో అన్నదాన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి హాజరై వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. వినాయకుని దర్శనం కోసం వచ్చిన భక్తులకు అన్నప్రసాదం అందించడంతో పాటు ఉత్సవ నిర్వాహకులను అభినందించారు. భక్తి, ఆధ్యాత్మికతతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండపం వద్ద ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. గణేష్ నవరాత్రి ఉత్సవాలు గ్రామంలో ఐక్యత, భక్తిభావాన్ని పెంపొందించేలా కొనసాగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ-సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ భూరెడ్డి కళావతి-సంజీవరెడ్డి, ఉపసర్పంచ్ నాగం సరిత-సుధీర్ రెడ్డి, జిల్లా నాయకులు నకిరేకంటి వెంకన్న, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్, నకరికంటి మధు, కమిటీ సభ్యులు, గణేష్ ఉత్సవ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# భద్రాద్రి కొత్తగూడెంను కరువు జిల్లాగా ప్రకటించాలి

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట న్యూడెమోక్రసీ ధర్నా




**చుంచుపల్లి,భద్రాద్రి బ్యూరో, తెలంగాణ చౌరస్తా:**

రాష్ట్రంలోనే పూర్తిగా ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను తక్షణమే కరువు ప్రాంతంగా ప్రకటించి, సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం చుంచుపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం సీనియర్ అసిస్టెంట్ కళావతికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 376 మండలాల్లో వర్షపాతం లేక పంటల సాగు గణనీయంగా తగ్గిపోయిందన్నారు. గతేడాదితో పోలిస్తే కేవలం 20 శాతం మేరకే వరి సాగైందని తెలిపారు. వర్షాలు పడక, పనులు లేక రైతులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తీర్చే బాట లేక అర్ధాకలితో అలమటిస్తున్న ప్రజలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు.కరువు జిల్లాగా ప్రకటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి ఉపశమన చర్యలు చేపట్టాలి.16 గంటల విద్యుత్ బోరు బావులపై ఆధారపడిన రైతులకు రోజుకు 16 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయాలి.సాంకేతిక అవగాహన లేక రైతులు ఇబ్బందులు పడుతున్నందున వ్యవసాయంలో యాప్ విధానాన్ని రద్దు చేయాలి. ఉపాధి హామీ పెంపుఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనిదినాలను 200 రోజులకు పెంచి, దినసరి కూలీగా 600 రూపాయలు చెల్లించాలి. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కల్తి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు ఎస్కే ఉమర్, నాయకుడు హిడమ, ఐఎఫ్టీయూ కొత్తగూడెం ఏరియా నాయకులు మోత్కూరి మల్లికార్జునరావు, మంకెన వెంకటేశ్వర్లు, ఎన్. సంజీవ్, పీవైఎల్ పట్టణ అధ్యక్షుడు లిక్కి నరేష్, బత్తుల నాగరాజు, పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు కల్తీ రాములమ్మ, నాయకురాళ్లు బి. వెంకటమ్మ, సంధ్య, రాధా, నందిని, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# 118 జీవో భూముల క్రమబద్ధీకరణ

- 22-A జాబితా నుంచి తొలగిస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు
- అర్హులకు త్వరలో పట్టాల పంపిణీ
- ఎల్బీనగర్ నియోజకవర్గంలో 9,792 కుటుంబాలకు లబ్ధి
- హర్షం వ్యక్తం చేసిన నాగోల్ డివిజన్ మాజీ ప్రెసిడెంట్ మంజుల రెడ్డి



**ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా:**

జీవో 118 బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు 118 జీవో పరిధిలోని భూములను నిషేధిత భూముల జాబితా నుంచి తొలగిస్తూ రెవెన్యూ శాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలపడం పట్ల నాగోల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రెసిడెంట్ మంజులా రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని 9,792 కుటుంబాలకు నేరుగా లబ్ధి చేకూరనుందని తెలిపారు.క్రమబద్ధీకరణకు అర్హులైన బాధితులకు త్వరలో పట్టాలను పంపిణీ చేస్తున్నట్లు అధికారులు వెల్లడించడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు.దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోక వేధిస్తున్న ఈ సమస్యను పరిష్కరించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి,జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్ బాబుకి ఎల్బీనగర్ నియోజకవర్గ ప్రజల తరపున నాగోల్ మాజీ డివిజన్ ప్రెసిడెంట్ మంజులా రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.




# వినాయక మండపాల వద్ద పోలీసుల అవగాహన సదస్సు

**ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా:**

వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా,సురక్షితమైన వాతావరణంలో నిర్వహించేందుకు నాగోల్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ కాలనీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.బండ్లగూడలోని రాజీవ్ సద్భావన అపార్ట్‌మెంట్స్,తట్టి అన్నారంలోని అన్నవరపు సత్యనారాయణ కాలనీల వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద ప్రజలకు, ఉత్సవ నిర్వాహకులకు రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, డ్రగ్స్ నియంత్రణ మహిళా రక్షణపై ప్రత్యేక సూచనలు చేశారు.ఈ సందర్భంగా నాగోల్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ మాట్లాడుతూ..ఉత్సవాల వేళ ప్రజల భద్రతకే పోలీసులు ప్రథమ ప్రాధాన్యం ఇస్తారని తెలిపారు.యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని.. డ్రగ్స్ విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు చేరవేయాలని కోరారు. మండపాల వద్ద మహిళలు,బాలికలతో అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు పాల్పడినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీటుబెల్ట్ ధరించడం నిర్బంధమని గుర్తుచేశారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, రాంగ్ రూట్ ప్రయాణం, డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోన్ మాట్లాడటం వంటివి ప్రమాదకరమని స్పష్టం చేశారు. మండపాల వద్ద వాహనాలను రోడ్డుపై నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో నాగోల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మల్లారెడ్డి,ఎస్సై సూర్య, ట్రాఫిక్ హెచ్‌సీలు నర్సింహ, దశరథ, ఎస్‌జీహెచ్‌సి లక్ష్మి, కవిత కాలనీ వాసులు వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# ఎస్సారెస్పీ భూములను పరిశీలించిన కలెక్టర్

**సైదాపూర్,తెలంగాణ చౌరస్తా:-**

మండలంలోని ఎక్లాస్పూర్ గ్రామంలో ఎస్సారెస్పీకి సంబంధించిన భూములను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు దాదాపు నాలుగు సర్వే నంబర్ల పరిధిలో ఉన్న సుమారు 24 ఎకరాల భూమి వివరాలను పరిశీలించిన కలెక్టర్..భూమి ప్రస్తుత పరిస్థితి, వినియోగం తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సైదాపూర్ తహసీల్దార్ గుర్రం శ్రీనివాస్ గౌడ్‌ను అడిగి భూమికి సంబంధించిన పలు వివరాలను తెలుసుకున్నారు. ఎస్సారెస్పీ భూమి ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉందా..? అనే అంశంపై క్షేత్రస్థాయి పరిస్థితులను కలెక్టర్ పర్యవేక్షించారు.భూమికి సంబంధించిన సర్వే నంబర్లు, విస్తీర్ణం, రెవెన్యూ రికార్డుల్లో నమోదైన వివరాలను పరిశీలించి సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్‌తో పాటు మండల సర్వేయర్ మనోజ్ రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 18 ఆదివాసీలకు చీకటి రోజు

- జీవో 149/76తో ఆదివాసుల హక్కుల కొల్లగొత
- అంబేద్కర్ విగ్రహం వద్ద తుడుం దెబ్బ నల్ల బ్యాడ్జీలతో నిరసన
- తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు సనప కోటేశ్వరరావు



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా :**

సెప్టెంబర్ 18 ఆదివాసీల జీవితాల్లో ఆరని చీకట్లను నింపిన నల్ల రోజని ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) జిల్లా అధ్యక్షుడు సనప కోటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పోస్టాఫీసు కూడలి వద్దగల అంబేద్కర్ విగ్రహం ప్రాంగణంలో తుడుం దెబ్బ ఆధ్వర్యంలో నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సనప కోటేశ్వరరావు మాట్లాడుతూ... 1976 సెప్టెంబర్ 18న అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) కాలంలో ఇతర వెనుకబడిన తరగతుల్లో ఉన్న లంబాడీలను 149/76 ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా గిరిజన జాబితాలో చేర్చారని గుర్తుచేశారు. ఆ సమయంలో కేవలం చదువు నిమిత్తం ఐదు శాతం ప్రాతిపదిక కల్పిస్తే, దానిని ఆసరాగా చేసుకుని మహారాష్ట్ర, ఒరిస్సా, కర్ణాటక తదితర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో వలసలు వచ్చారని ఆరోపించారు.ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వారు ఇక్కడ గిరిజన హోదా పొందుతూ, రాజ్యాంగబద్ధంగా ఆదివాసీలకు దక్కాల్సిన ఫలాలను దక్కకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దిగువ స్థాయి నౌకరీల నుండి ఉన్నత స్థాయి పాలనాధికారుల వరకు ఆదివాసీలకు దక్కాల్సిన అవకాశాలను కొల్లగొడుతున్నారన్నారు. ఫలితంగా ఆదివాసీ బిడ్డలకు చదువులో సీట్లు గానీ, నౌకరీలు గానీ రాని దౌర్భాగ్య పరిస్థితి దాపురించిందన్నారు.ఈ నల్ల చట్టం వచ్చి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగానే ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికే సహకరిస్తూ ఆదివాసీలకు అవకాశాలను అందని ద్రాక్షలా మారుస్తున్నాయని మండిపడ్డారు.ఈ నిరసన కార్యక్రమంలో తుడుం దెబ్బ విభాగ అధ్యక్షుడు పాయం లక్ష్మీనర్సు, గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు కరం ప్రశాంత్, సోయం సత్యనారాయణ, తాటి పుల్లయ్య, గుమ్మడిశెట్టి, మాడే రమేష్ తదితరులు పాల్గొన్నారు.




# అనాథలకు అండగా.. మాతృదేవోభవ ఆశ్రమం

- బిజెపి రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు గూడెపు మధు
- ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

**అబ్దుల్లాపూర్‌మెట్,తెలంగాణ చౌరస్తా :**

సమాజంలోని అనాథలు, మానసిక వికలాంగుల ఆకలి తీర్చడమే ధ్యేయంగా మాతృదేవోభవ అనాథ ఆశ్రమంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు గుడెపు మధు గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొత్త అశోక్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆశ్రమంలోని 150 మంది అభాగ్యులకు అన్నదానం చేశారు.ఈ సందర్భంగా కొత్త అశోక్ గౌడ్, గూడెపు మధు మాట్లాడుతూ..సమాజంలో ఆపన్నులు, అనాథలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.శుభకార్యాలు, పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాల వంటి వేడుకలను ఇలాంటి ఆశ్రమాల్లో నిర్వహిస్తూ అన్నదానం చేయడం ద్వారా మానవతా విలువలను చాటుకోవచ్చని పిలుపునిచ్చారు. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడమే గొప్ప సేవ అని.. దాతలు ముందుకు వచ్చి ఆశ్రమానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకులు మాట్లాడుతూ..దాతలు స్వయంగా ఆశ్రమాన్ని సందర్శించి, అక్కడి పరిస్థితులను తెలుసుకుని తమకు తోచిన విధంగా సహాయం అందించాలని కోరారు.ఈ సేవా కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు చేవుల శ్రీహరి, శ్రీకాంత్, బాలరాం, సాయి, నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



# బొజ్జ గణపయ్య.. పూజలందుకోవయ్యా

- కుంకుమార్చనలు.. అన్నదానాలు
- భక్తిశ్రద్ధలతో గణనాథునికి ఘనంగా పూజలు

**పెద్దపల్లి,తెలంగాణ చౌరస్తా :**

పెద్దపల్లి పట్టణంలోని లక్ష్మీ గణపతినగర్ లో నెలకొల్పిన గణనాథునికి భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని భక్తితో కుంకుమ పూజలు చేశారు. అనంతరం మొక్కులు చెల్లించుకుని, స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని భక్తులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కాచే కృష్ణ, రేకుంట సంతోష్, రమేష్, కలవేని ఓదెలు, మెరుగు మహేష్, పంబాల సదానందం, మొగుసాల నరసింహారెడ్డి, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.







# కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన గిరిజనులు

- గిరిజన రిజర్వేషన్ల పెంపుతో మారిన జీవితాలు
- 10% రిజర్వేషన్‌కు 4 ఏళ్లు పూర్తి
- వేదాంతపురంలో ఘనంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంబరాలు
- ఆదివాసీల గుండెల్లో నిలిచిన కేసీఆర్: నాయకుల కొనియాడింపు

**అశ్వారావుపేట,తెలంగాణ చౌరస్తా :**

అశ్వారావుపేట మండలంలో పండగలా సాగిన వేడుకలు అశ్వారావుపేట మండలం వేదాంతపురం ఆదివాసీ గిరిజన పంచాయతీలో గిరిజనుల రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచి నాలుగేళ్లు పూర్తయిన శుభసందర్భాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ నాయకులు, స్థానిక గిరిజనులు అత్యంత ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం (క్షీరాభిషేకం) చేసి తమ కృతజ్ఞత తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ డాక్టర్ ఉదయజ్యోతి మాట్లాడుతూ గిరిజన బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం కేసీఆర్ తీసుకున్న 10 శాతం రిజర్వేషన్ నిర్ణయం చరిత్ర పుటల్లో నిలిచిపోతుందని, విద్య, ఉద్యోగ రంగాల్లో ఆదివాసీలకు ఇది ఎంతగానో మేలు చేసిందని పేర్కొన్నారు. ఈ రిజర్వేషన్ పెంపు ద్వారా ముఖ్యంగా గిరిజన ఆడబిడ్డలు ఎంతో లబ్ధి పొందారని, కేసీఆర్ చేసిన సహాయాన్ని గిరిజన జాతి ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని కాసాని పద్మ చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా 10 శాతం రిజర్వేషన్ అమల్లోకి తెచ్చి కేసీఆర్ ఆదివాసీల గుండెల్లో దేవుడిగా నిలిచారని ఓగ్గిలా పూజా కొనియాడారు. రిజర్వేషన్ల పెంపుతో తమ గిరిజన యువతకు విస్తృత ఉద్యోగ అవకాశాలు లభించాయని, బీఆర్ఎస్ పాలనలోనే గిరిజనులకు నిజమైన న్యాయం జరుగుతుందని సోమిని శివ శంకర్ ప్రసాద్ స్పష్టం చేశారు.

ఈ వేడుకల్లో బీఆర్ఎస్ మండల నాయకులు కాసాని పద్మచంద్రమోహన్, కౌన్సిలర్ డాక్టర్ ఉదయజ్యోతిడాక్టర్ ప్రసాద్, ఓగ్గిలా పూజా, సోమిని శివ శంకర్ ప్రసాద్, సత్యవరపు సంపూర్ణ, జూజ్జురపు శ్రీరామ్ మూర్తి, గుడవర్తి వెంకటేశ్వరరావు, మోటూరి మోహన్, కూనసోతు నవీన్, ఆరెపల్లి గోవిందం, శెట్టిపల్లి రఘురాం, జీవన్, మిద్దిన కొండయ్యలతో పాటు పలువురు గిరిజన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు, స్థానిక గిరిజన ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# వ్యసనాలకు నో చెప్పి... విజయానికి స్వాగతం పలకండి

**హనుమకొండ, తెలంగాణ చౌరస్తా:**




స్థానిక లాల్ బహదూర్ కళాశాలలో నశాముక్త యువభారత్ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ అరుణ డిహెచ్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కాకతీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఈసం నారాయణ విచ్చేసి విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ....మన దేశ భవిష్యత్తు మన యువత చేతుల్లో ఉందని,యువత ఆరోగ్యంగా,క్రమశిక్షణతో,మంచి ఆలోచనలతో ముందుకు సాగితేనే భారతదేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా డిస్టిక్ యూత్ ఆఫీసర్ వరంగల్ భూక్య సంజీవ్ నాయక్ మాట్లాడుతూ.... మాదకద్రవ్యాలు అయినా గుట్కా తంబాకు సిగరెట్ వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఏ.రాఘవేందర్ రెడ్డి, హింగే రాజేశ్వర్ రావు,ఉమ్మగొని శ్రీనివాస్,అధ్యాపకులు డాక్టర్ రమణారెడ్డి,డాక్టర్ సుధాకర్,డాక్టర్ విజయకుమార్, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.



# నేడే కోదాడలో మెగా జాబ్ మేళా

- 300కు పైగా కంపెనీలు, 3,500కు మించిన ఉద్యోగావకాశాలు
- ఐదు జిల్లాల యువతీ యువకులకు ఒకే వేదికపై ఇంటర్వ్యూలు
- మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి చొరవతో "మెగా జాబ్ మేళా"*

**కోదాడ,తెలంగాణ చౌరస్తా:**

గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో శనివారం కోదాడలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు.ఈ మేళాలో 300కు పైగా కంపెనీలు పాల్గొని, 3,500కు మించిన ఉద్యోగాలను కల్పించేందుకు నియామక ప్రక్రియ చేపట్టనున్నాయి. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో, కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతి రెడ్డి సమన్వయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, రాష్ట్ర పరిశ్రమల శాఖ ఈ మేళా నిర్వహణకు సహకరిస్తున్నాయి.

సిసి రెడ్డి పాఠశాలలో జాబ్ మేళాకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ తో కలిసి ఎమ్మెల్యే పద్మావతి పరిశీలించారు అనంతరం వారు మాట్లాడుతూ ఈ జాబ్ మేళా కార్యక్రమానికి రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు లు పాల్గొంటున్నట్లు తెలిపారు. సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి-భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ మేళాలో పాల్గొననున్నారు. కంపెనీల ప్రతినిధులతో నేరుగా మాట్లాడడంతోపాటు ఒకే చోట ఇంటర్వ్యూలకు హాజరయ్యే అవకాశం వారికి లభించనుంది.

ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ పట్టభద్రులతోపాటు డిప్లొమా, ఇతర విద్యార్హతలు కలిగిన యువతీ యువకులు తమకు సరిపడే ఉద్యోగాలను గుర్తించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగ ఇంటర్వ్యూల కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లడం, కంపెనీలను నేరుగా సంప్రదించలేకపోవడం, సరైన సమాచారం అందకపోవడం వంటి సమస్యలు గ్రామీణ యువతకు అడ్డంకిగా మారుతున్నాయి. ఈ ఇబ్బందులను తగ్గించి, కంపెనీలనే యువతకు దగ్గర చేయాలనే ఉద్దేశంతో కోదాడలో ఈ మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేశారు.2025 అక్టోబర్‌లో హుజూర్‌నగర్‌లో నిర్వహించిన ఉద్యోగ మేళాలో 200కు పైగా కంపెనీలు పాల్గొనగా, సుమారు 900 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆ మేళా విజయాన్ని కొనసాగిస్తూ ఈసారి మరింత భారీ స్థాయిలో కోదాడలో నియామక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న ఐదు జిల్లాల యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు తగిన ఉద్యోగాన్ని పొందేందుకు శనివారం కోదాడలో జరిగే మెగా జాబ్ మేళాకు పెద్ద సంఖ్యలో హాజరుకావాలి అని కోరారు.






# 'పల్లవి'స్కూల్లో బాలికలకు అవగాహన సదస్సు

**పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా:**

పెద్దపల్లి లోని పల్లవి స్కూల్ విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు.పాఠశాల కరస్పాండెంట్ శోభారాణి ఆధ్వర్యంలో శ్రీదేవి,రజనీ ద్వారా ఈ కార్యక్రమం సాగింది.విద్యార్థినులకు విజ్ఞానదాయకమైన,అద్భుతమైన కార్యక్రమం నిర్వహించి మంచి స్పర్శ, చెడు స్పర్శ, వ్యక్తిగత భద్రత, బాలికలు తమను తాము ఎలా రక్షించుకోవాలి,కౌమార దశ సవాళ్లు,ఇతర కౌమార సంబంధిత సమస్యలు వంటి అంశాలను స్పష్టంగా సులభంగా విద్యార్థునులకు అర్థమయ్యే రీతిలో వివరించారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ శోభారాణి మాట్లాడుతూ....సరైనా నిర్ణయాలు తీసుకోవడం,ఆత్మవిశ్వాసం,బాధ్యతాయుతంగా మారడానికి సహాయపడే అంశాలను వివరించారు.ఆడపిల్లలు ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా ఉండాలని,అమ్మాయిలకు ఎలాంటి ఇబ్బందికర పరిస్థితి తలెత్తినా అది కచ్చితంగా తల్లితో చెప్పాలని సూచించారు.మేం ఏం చేయలేం అని నిస్సహాయ స్థితి నుంచి మేం ఏదైనా చేయగలమనే ధైర్యం ఆడపిల్లల్లో రావాలన్నారు.ఆడపిల్లల్లో ఆత్మస్థైర్యం కల్పించేందుకు గుడ్ టచ్,బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.






# దోమల నివారణకు ఫాగింగ్

**కాల్వ శ్రీరాంపూర్,తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని జాఫర్ ఖాన్ పేట్ గ్రామంలో ఫాగింగ్ యంత్రంతో దోమల నివారణకు చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ...గ్రామంలో దోమల నివారణ కోసం దోమల మందు పిచికారీ కార్యక్రమం చేపట్టామన్నారు. గ్రామంలోని ప్రజలు ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాదగిరి జ్యోత్స్న శ్రీనివాస్, ఉపసర్పంచ్ శ్రావణి శ్రవణ్, వార్డు సభ్యులు చిన్నీ పాల్గొన్నారు.



# అంగన్వాడీ లో అక్షరాభ్యాస కార్యక్రమం

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**


కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని తారుపల్లి గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని అంగన్వాడీ టీచర్లు స్వప్న, శ్రావణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు అక్షరజ్ఞానానికి శ్రీకారం చుట్టి, విద్యపై ఆసక్తి కలిగించేలా ఉండాలన్నారు. చిన్నారుల విద్యాభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను సర్పంచ్, ఉప సర్పంచ్ అభినందించారు. ఈ కార్యక్ర మంలో గ్రామ సర్పంచ్ గాజనవేన స్వరూప సదయ్య, ఉప సర్పంచ్ అమిదాల స్వామి, గ్రామ కార్యదర్శి సందీప్, సున్నాలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

**పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా :**

అప్పనపేట జెడ్ పి హెచ్ ఎస్ లో జరిగిన ఎస్ జి ఎఫ్ జోనల్ స్థాయి టోర్నమెంట్‌లో పల్లవి స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటి, జిల్లా స్థాయికి ఎంపికయ్యారు.విజేతలు: యు14 కబడ్డీ (బాలురు): వి. సాహిత్ యు17 ఖోఖో, (బాలురు): కె. గౌతమ్ యు14 ఖోఖో (బాలురు): సంయుక్త్ యు14 ఖోఖో (బాలికలు): ఆశ్రిత,హాస్య పటేల్కు రస్పాండెంట్ టి.శోభారాణి ప్రోత్సాహంతో విద్యార్థులు రాణించారు.ఎంపికైన వారిని ప్రిన్సిపల్ జరీనా ,పిఈటీ అనిలస్టాఫ్ అభినందించారు.







# గోగుల బంధం వీధిలో ఘనంగా అన్నదాన సమారాధన

- వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా భక్తిశ్రద్ధలతో ప్రసాద వితరణ
- పాల్గొన్న 14, 17 వార్డుల కౌన్సిలర్లు బిఆర్ఎస్,బిజెపి నాయకులు
- పెద్ద సంఖ్యలో తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించిన భక్తులు

**అశ్వారావుపేట,తెలంగాణ చౌరస్తా:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండల కేంద్రంలోని గోగుల బంధం వీధిలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్నాయి .ఈ ఉత్సవాల్లో భాగంగా గోగుల బంధం వీధిలోని వినాయక మండపం వద్ద నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమం ఎంతో ఘనంగా విజయవంతంగా జరిగింది. ఉదయం నుంచే మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గణనాథునికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు, స్థానిక



ప్రజలకు పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ చేపట్టారు.ఈ అన్నదాన కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు హాజరై ఆధ్యాత్మిక శోభను మరింత ద్విగుణీకృతం చేశారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన 14వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ ఉదయ్ జ్యోతి - డాక్టర్ ప్రసాద్ రావు దంపతులు, బిజెపి పార్టీకి చెందిన 17వ వార్డు కౌన్సిలర్ పమిడి గీతశ్రీ, ఆమె మామగారు పమిడి లక్ష్మణరావు, అలాగే బిఆర్ఎస్ పార్టీ ప్రముఖ నాయకురాలు కాసాని పద్మ - కాసాని చంద్రమోహన్ దంపతులు ప్రత్యేక అతిథులుగా విచ్చేశారు. మొదటగా వీరంతా వినాయక స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు అందుకున్నారు. ఆ తర్వాత నిర్వాహకులతో కలిసి భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మరియు నాయకులు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమాలు మానసిక ప్రశాంతతను ఇవ్వడమే కాకుండా, రాజకీయాలకు అతీతంగా సమాజంలో సోదరభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. గోగుల బంధం వీధిలో ఉత్సవాలను ప్రతి ఏటా ఎంతో భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. గణనాథుని ఆశీస్సులతో పట్టణ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు.గణేష్ మండప నిర్వాహకులు ఎంతో క్రమశిక్షణతో ఏర్పాటు చేసిన ఈ అన్నదాన కార్యక్రమంలో స్థానిక వీధి ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించి నిర్వాహకుల కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మండప కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు యువకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.